క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



చేబ్రోలు: కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన దానబోయిన నాగరాజు(35) తాపీ వర్కర్‌గా పని చేస్తున్నాడు. పనులు ముగించుకుని రాత్రి బైక్‌పై గుంటూరు నుంచి నారాకోడూరుకు వస్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. తలకు, ముఖానికి, కాళ్లు, చేతులకు బలమైన గాయాలైన నాగరాజును 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు.

మృతురాలి వివరాలు లభ్యం

చీరాల అర్బన్: లాడ్జిలో మృతి చెందిన మహిళ వివరాలు లభ్యమయ్యాయి. చీరాలలోని కొత్తపేట సమీపంలో 216 జాతీయ రహదారి వద్ద గల ఓ లాడ్జికి వచ్చి గుండెపోటుతో మహిళ మృతి చెందిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఆ మహిళ వివరాలు లభ్యం కావడంతో శనివారం టూటౌన్ పోలీసులు వెల్లడించారు. మహిళది గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడికి చెందిన వై.స్వరూపారాణి (24)గా గుర్తించారు. స్వరూపారాణి, నరసింహారావు దంపతులు. భార్యాభర్తలకు కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆమె రెండు రోజుల క్రితం చీరాలకు వచ్చింది. అస్వస్థతకు గురవ్వడంతో చీరాలలోని ఓ ఆటో డ్రైవర్ సాయంతో షాపులో ఆమెకు కావాల్సిన మందులు తీసుకుంది. తర్వాత లాడ్జీ వద్దకు ఆటోలో వెళ్లి అక్కడ గదిని అద్దెకు తీసుకుంది. మరుసటి రోజు మధ్యాహ్నం ఊపిరి ఆడకపోవడం, గుండెనొప్పి రావడంతో లాడ్జీ పక్కనే ఉన్న ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం చీరాల ఏరియా వైద్యశాలకు సిబ్బంది తీసుకెళ్లారు. కొద్దిసేపటికే ఆమె మృతి చెందింది.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



పాలిటెక్నిక్ కళాశాలలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శేఖర్ తదితరులు

గుంటూరు రూరల్: ఎందరో ఇంజనీర్లను దేశానికి ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అందించిందని ప్రిన్సిపాల్ శేఖర్ తెలిపారు. నల్లపాడులోని కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 1960లో స్థాపించిన కళాశాల 62 సంవత్సరాలుగా విజయవంతంగా ఎందరో ఇంజనీర్లను అందించిందని తెలిపారు. జాతీయ స్థాయిలో కళాశాల గుర్తింపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి సహాయ, సహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జి.వి. శేషగిరిరావు, కార్యదర్శి కె. కృష్ణారావు, టి. సుబ్బారావు, బి. శ్రీనివాసరెడ్డి, ఆర్. లక్ష్మయ్య, కె. రామారావు, పి.ఆదిశేషు, పి.నీలిమ, జి.అనూరాధ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజన్నా నిను మరువలేం.. మా గుండెల్లో పదిలం



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



తక్కెళ్లపాడులో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిలారి తదితరులు



పొన్నూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో నాయకులు

- గ్రామగ్రామాన ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు
- వై.ఎస్. నామస్మరణతో మారుమోగిపోయిన పల్లెలు

ప్రత్తిపాడు: స్థానిక ఇందిరాగాంధీ బొమ్మ సెంటరులోని వైఎస్ఆర్ కాంస్య విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విగ్రహం ఎదుట కేక్‌ను కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. సంక్షేమ పథకాలతో ప్రజామన్ననలు పొందిన వ్యక్తి వైఎస్ఆర్ అని కొనియాడారు. పార్టీ మండల కన్వీనర్ గట్టు విజయ్, పార్టీ గ్రామ ప్రెసిడెంట్ గుజ్జుల శివారెడ్డి, ఉప సర్పంచ్ బి. వెంకటేశ్వరరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, సర్పంచులు రాంబాబు, లాం రత్నకుమార్, షేక్ సలాం, నిమ్మగడ్డ జనార్దన్, చెంచురామారావు పాల్గొన్నారు.

• వట్టిచెరుకూరు మండలం గారపాడులో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ భవనం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పార్టీ మండల కన్వీనర్ మన్నవ వీరనారాయణ, సర్పంచులు జి. శ్రీనివాసరావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సయ్యద్ నూరుల్లా, వైస్ ఎంపీపీ బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొన్నూరులో ఘనంగా వేడుకలు

చేబ్రోలు: పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం, ఐలాండ్ సెంటర్ ప్రాంతాల్లో శనివారం మహానేత వైఎస్సార్ 74వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేక్‌ను కట్ చేసి పంచారు. కార్యక్రమంలో మార్కెట్టు యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపీపీ భవనం పద్మలీల, అంజుమన్ కమిటీ చైర్మన్ షేక్ మాము, బొద్దులూరి రంగారావు, దాసరి నారాయణరావు, యందేటి వెంకట సుబ్బయ్య, కొల్లేరు శ్రీనివాసరావు, గేరా కుమారి, అల్లాభక్షు, దేవరకొండ గోపి, ఆదిశేషు, యానాదిరావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా ఎందరో ప్రాణాలకు రక్షణ

గుంటూరు రూరల్: ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతో మంది ప్రాణాల్ని కాపాడిన మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి అని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) తెలిపారు. మండలంలోని లాలుపురంలో శనివారం డాక్టర్ వైఎస్సార్ 74వ జయంతి వేడుకల్ని నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



చేబ్రోలులో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ సాహితి తదితరులు



గారపాడులో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

•నగరాలులో కుమ్మర, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, చిన్నపలకలూరులో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, పెదపలకలూరులో 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, వెంగళాయపాలెంలో దేవరకొండ నాగేశ్వరరావు, నల్లపాడులో 27వ డివిజన్ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జొన్నలగడ్డలో శ్రీవేణి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

వాడవాడలా వైఎస్సార్ జయంతి వేడుకలు

కాకుమాను: స్థానిక ఎస్సీ కాలనీలో మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్ ఆధ్వర్యంలో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మెరిగల సుందరరావు, కాకుమాను ఎంపీటీసీ-2 కానుగుల పరమేశ్వరరావు పాల్గొన్నారు. కొమ్మూరులో పార్టీ సీనియర్ నాయకులు గేరా పున్నారావు ఆధ్వర్యంలో వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ పొన్నూరు షేక్ కరీముల్లా, ఎం.సింగయ్య పాల్గొన్నారు. పాండ్రపాడులో గ్రామ సర్పంచ్ దేవిరెడ్డి సాంబయ్య ఆధ్వర్యంలో, బీకేపాలెంలో మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్త అమేష్, కాండ్రు హైమారావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ మెరిగల రవిబాబు, సచివాలయ మండల కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పెదకాకానిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

పేదల ఆశాజ్యోతి డాక్టర్ వైఎస్సార్

గుంటూరు రూరల్: పేదల ఆశాజ్యోతి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మేకతోటి దయాసాగర్ తెలిపారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వైఎస్సార్ చిరస్థాయిగా ఉంటారు

సూర్యచంద్రులు ఉన్నంత కాలం ప్రజల గుండెల్లో మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి నిలిచి ఉంటారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్సార్ జయంతి సందర్భంగా 41వ డివిజన్ అడవితక్కెళ్లపాడులో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బి. స్మితపద్మజ, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి పాల్గొన్నారు.

జన హృదయనేత వైఎస్సార్

పెదనందిపాడు: జన హృదయనేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశీం పీరా కేక్ కట్ చేశారు. ముందుగా ఎస్సీ కాలనీలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ ఆఫీసులో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి పద్మారావు, ఉప సర్పంచ్ దివ్వి రాంబాబు, మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ వలి పాల్గొనారు.

చేబ్రోలులో ఘనంగా వేడుకలు

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలులోని పాత పోలీసు స్టేషన్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఎంపీపీ కె. సాహితి తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, కె. కిరణ్‌కుమార్, పల్లెపాటి కోటి, బి. విజయ్‌కుమార్, చౌడయ్య, జి. శ్రీరెడ్డి పాల్గొన్నారు. మంచాల, వేజండ్ల, గొడవర్రు, శలపాడు, వడ్లమూడి, శేకూరు, నారాకోడూరు, కొత్తరెడ్డిపాలెం గ్రామాల్లో మహానేత వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన మహనీయుడు

పెదకాకాని : రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమించి రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి అని గ్రామ సర్పంచి స్వరూపరాణి, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి అన్నారు. పెదకాకాని శివాలయం రోడ్డులోని దివంగత నేత విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదకాకాని మండలంలో పలు గ్రామాల్లో శనివారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకొని విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, మండల కో- ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నజీర్, ట్రస్టు బోర్డు సభ్యులు గంగవరపు మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గోళ్ల జోసెఫ్, గోళ్ల శ్యామ్ ముఖర్జీ బాబు, ఆలపాటి రాఘవ, కృష్ణారెడ్డి, కొంకి రామారావు, బండ్లమూడి భానుకిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల హృదయాల్లో వై.ఎస్. చెరగని ముద్ర

పెదకాకాని: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడులో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వై.ఎస్. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేద ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మహనీయుడు డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అని పేర్కొన్నారు. సొసైటీ అధ్యక్షుడు మేరుగ సుబ్బారావు, వార్డు మెంబరు షేక్ ఖాసీం, పెనుమాల అరుణ్‌గాంధీ పాల్గొన్నారు.

• నంబూరులో జరిగిన వేడుకల్లో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ విజయలక్ష్మి, ఏపీ రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ అవినాష్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డ్ కమిటీ మెంబర్ సయ్యద్ సుభాని,పెదకాకాని సొసైటీ చైర్మన్ భీమవరపు కోటిరెడ్డి, పెదకాకాని శివాలయం మాజీ చైర్మన్ బొంతు శివారెడ్డి, సభ్యురాలు మందాల జ్యోతి , సచివాలయం కన్వీనర్ దండే బాబు, జెట్టి అనిల్‌కుమార్, డాక్టర్ రాజలక్ష్మి పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో కేకును కట్ చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



పెదనందిపాడు పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ ఖాశీంపీరా, నేతలు



కాకుమాను ఎస్సీ కాలనీలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

పొన్నూరు అభివృద్ధి నిరోధకుడు ధూళిపాళ్ల

ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

నగరంపాలెం: పొన్నూరు పట్టణంలోని భావన్నారాయణ స్వామి ఆలయ భూములపై తెలుగు దుష్ప్రచారాల పార్టీ (టీడీపీ) నేత ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడటం విడ్డూరంగా ఉందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ఎద్దేవా చేశారు. గుంటూరు కృష్ణనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పలుమార్లు ధూళిపాళ్ల నరేంద్ర ఎమ్మెల్యేగా గెలిచిన నియోజకవర్గంలో అభివృద్ధి జాడలేదని ఆరోపించారు. ఆయన హయంలో అరాచకాలు సృష్టించేవాడని, ఎవరైనా పనులు అడిగితే వారిపై కేసులు నమోదు చేయించిన ఘనత ఆయనదేనని ధ్వజమెత్తారు. పాడి లేకపోయినా పాడి రైతుగా పేరు నమోదు చేసుకుని సంగం డెయిరీని కైవసం చేసుకున్న ఘనుడని అన్నారు. పాడి రైతుల లాభాలను, ఉద్యోగులకు బోనస్‌లు ఇతరత్రా చెల్లించకుండా రూ.వందల కోట్లను కొట్టేసిన విషయం అందరికి తెలుసునని చెప్పారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రధానమైన నాలుగు హామీల్లో ఒకటైన ఆటోనగర్ ఏర్పాటు స్థాపనకై పొన్నూరులో ఎక్కడా ప్రభుత్వ భూముల్లేవని అన్నారు. దీంతో పట్టణంలోని భావన్నారాయణ స్వామి ఆలయ భూములలో 19.99 ఎకరాలు 11 ఏళ్ల లీజుపై పాలక మండలి దృష్టికి తీసుకొచ్చామని అన్నారు. దీనిపై తీర్మానం చేసి, దేవదాయ శాఖకు పంపించారని పేర్కొన్నారు. ఆ శాఖ అనుమతిస్తూ ఏపీఐసీసీకి పంపించిందని చెప్పారు. అయితే ఆటోనగర్ స్థాపనలో భాగంగా ప్రధాన రహదారి వైపు ఉన్న ఆలయ భూముల్లో సుమారు 9.4 ఎకరాలలో దుకాణాల సముదాయాల (షాపింగ్ కాంప్లెక్స్) నిర్మాణాలకు, మిగిలిన వెనుక స్థలంలో ఆటోనగర్ ఏర్పాటు చేసే విధంగా సూచించారని చెప్పారు. అందుకు అందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ఎకరానికి చెల్లిస్తున్న కౌలుకు రెండు రెట్లు రెట్టింపు అనగా రూ.39 వేలు చెల్లించేందుకు సంసిద్ధమని చెప్పారు. ఆటోనగర్‌లో దుకాణాలను అసోసియేషన్ సభ్యత్వాల ప్రకారం కేటాయింపు జరుగుతుందని, ఇందులో అన్నివర్గాల వారు ఉంటారని చెప్పారు. దీని వల్ల 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు భావన్నారాయణ స్వామి ఆలయంలో కుంభాభిషేకం జరగలేదని త్వరలో అత్యంత వైభవంగా చేపడతామని చెప్పారు. దేవదాయ శాఖ సీజీఎఫ్ కింద రూ.45 లక్షలు, దాతలు అందించే రూ.21 లక్షలతో భావన్నారాయణ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. తిరుమల తిరుపతి తరహాలో నాలుగు మాఢ వీధులుగా అభివృద్ధి చేసేందుకు కార్యచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

ధూళిపాళ్ల నరేంద్ర దొరికిన కొద్ది దోచుకుని, ప్రస్తుతం నీతులు వల్లేయడం విడ్డూరమని మండిపడ్డారు. తండ్రి, సోదరుడు, కుమార్తెల పేర్లతో కాలనీల పేర్లతో అతి చౌకగా భూములు కొట్టేసిని ఘనుడు అని ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. త్వరలో పొన్నూరు రోడ్ విస్తరణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. అదే విధంగా చేబ్రోలు దగ్గర్లోని కొమ్మమూరి కాలువపై రూ.36 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కాకాని దర్గా లోపల, చుట్టు ప్రహరీ, రోడ్‌ను రూ.2 కోట్లతో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని సీజీఎఫ్, దాతల సహకారంతో రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇన్నేళ్లుగా అభివృద్ధి చేయని ధూళిపాళ్ళ అనవసరమైన ప్రకటనలు చేయవద్దని హితవు పలికారు. ఇకనైనా అవాస్తమైన ప్రచారానికి స్వస్తి చెప్పాలని అన్నారు. లేనిచో పరువు నష్టం దావా వేస్తామని చెప్పారు. పొన్నూరు అభివృద్ధిపై చర్చకు ఎక్కడైనా సిద్ధమని సవాల్ విసిరారు.